క్లుప్తంగా

విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ



పొట్నూరులో విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పద్మనాభం: బీజామృతంతో వరి విత్తనాలు శుద్ధి చేయడం వల్ల తెగుళ్లు నివారించవచ్చని వీఏఏ వర్మ సూచించారు. మండలంలోని పొట్నూరులో బీజామృతంతో వరి విత్తనాలు శుద్ధి చేయడంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ విత్తన శుద్ధి చేయడం వల్ల అధిక దిగుబడి వస్తుందన్నారు. ప్రధాన పంట వరి ముందు నవ ధాన్యాలు సాగు చేయాలని సూచించారు. భూసారం పెంపులో నవ ధాన్యాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సంతోష్, మీనా, హేమలత పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో ప్రతిభ



మొదటి స్థానం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫైనాన్షియల్ లిటరసీపై విశాఖలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. దీని ద్వారా ఆగస్టులో జరిగే జోనల్ స్థాయి క్విజ్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి జీరు వెంకట కీర్తన్, 10వ తరగతి విద్యార్థి గంటా పవన్ కుమార్ పాల్గొనే అవకాశం లభించింది. ఈ సందర్భంగా స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు వీరికి గైడ్‌గా వ్యవహరించిన సైన్స్ ఉపాధ్యాయుడు పక్కి నాగేశ్వరరావును ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

కేజీఎన్ ట్రస్ట్ అన్నదానం



విజయదుర్గ ఆలయంలో అన్నదానం చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

తగరపువలస: నాగవంశ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కాళ్ల గురునాయుడు జయంతి సందర్భంగా శుక్రవారం చిట్టివలసకు చెందిన కేజీఎన్ చారిటబుల్ ట్రస్ట్ బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో 400 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కాళ్ల శ్రీనివాసరావు, ఆలయ ట్రస్టీ రాజగిరి కుసుమహర, త్రినాథ్, సూర్య, పురుషోత్తం, మదన్, దీపక్, గణేష్, ఆనంద్ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్యతో విషాదం

తగరపువలస: విజయనగరంలోని వీటీ అగ్రహారంలో గురువారం రాత్రి మద్దిల హేమలత (19) అనే వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో భీమిలి మండలంలో శుక్రవారం విషాదం అలుముకుంది. ఎనిమిది నెలల క్రితం భీమిలి మండలం మజ్జివలసకు చెందిన హేమలత, శింగనబంద పంచాయతీ మద్దిలపేటకు చెందిన శంకర్ ప్రేమించుకుని హైదరాబాద్ బిర్లా మందిర్‌లో వివాహం చేసుకున్నారు. అనంతరం వీరు పెద్దల అనుమతితో వీటీ అగ్రహారంలో కాపురం ఉంటూ ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారం చేసుకుంటున్నారు. వీరికి గత పరిచయాలు ఉన్న స్నేహితులు వీటీ అగ్రహారం తరచూ వెళ్లి మానసికంగా వేధింపులకు గురి చేస్తుండేవారు. ఈ నేపథ్యంలో మనస్థాపం చెందిన హేమలత గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో భీమిలి మండలానికి చెందిన ఇరు కుటుంబాల వారు విజయనగరం బయలుదేరి వెళ్లారు. హేమలత ఆత్మహత్యతో ఇరు గ్రామాల్లో విషాదం నెలకొంది.

చంద్రబాబు కోసమే పవన్ కల్యాణ్ రాజకీయం

- సినిమాలు, కులాలు కూడు పెట్టవు
- మళ్లీ ముఖ్యమంత్రి అయ్యేది జగనే
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



శింగనబందలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



గొట్టిపల్లిలో సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

ఆనందపురం : కులం పేరు చెప్పుకొని ఊరూరా తిరుగుతున్న పవన్ కల్యాణ్ నమ్ముకున్న వారిని నట్టేట ముంచి చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయడానికి ఆపసోపాలు పడుతున్నాడని... ఆ శ్రమంతా వృథా అవుతుందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. మండలంలోని గొట్టిపల్లి, చందక గ్రామాల్లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డిని ఓడించడం... చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయడం నెరవేరని కల అని మండిపడ్డారు. సినిమా డైలాగులు, కుల రాజకీయాలు పేదలకు తిండి పెట్టవన్న విషయాన్ని పవన్ కల్యాణ్ తెలుసుకోవాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి పౌర సేవలు అందిస్తున్న వలంటీర్లు మహిళలను ఎత్తుకెళ్లి పోతున్నారని పవన్ మతిలేని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అలాంటి వారు రాజకీయాలకు పనికిరారన్నారు. బడుగు బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పథకాలు అమలు పరచడం వల్ల నిజమైన పేదలు ఎందరో సంక్షేమ పథకాలకు నోచుకోలేక పోయారన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే పారదర్శక పాలన తీసుకొచ్చి అర్హతే ప్రామాణికంగా, అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు అందించడంతో ప్రతి పేదవాడు సంతోషంగా ఉన్నాడని వివరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఒక్కొక్క కుటుంబానికి లక్షలాది రూపాయల లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదని కొనియాడారు. మంచి చేసేవారిని ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటారని, ఆ లక్షణాలన్నీ జగన్ మోహన్ రెడ్డిలో పుష్కలంగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా గొట్టిపల్లిలో 330 మందికి, చందకలో 431 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. గొట్టిపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సత్యపద్మ, తహసీల్దార్ ఎల్.రామారావు, ఎంపీడీవో ఎ.లవరాజు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బంటుబిల్లి మణిశంకర నాయుడు, సర్పంచ్‌లు బంక శ్రీను, గంటా జగదీశ్వర రావు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అప్పలనాయుడు, నాయకులు పాండ్రింకి అప్పారావు, గుసిడి వెంకట రమణ, లోలుగు రాజు, ఇల్లాపు వెంకటరావు, బొట్టా రామకృష్ణ, బీఆర్‌బీ నాయుడు, లెంక రాంబాబు, గంటా అప్పలరాజు, చందక సూరిబాబు, కాకర వెంకట రమణ, పిన్నింటి వెంకట రమణ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి తపించే వ్యక్తి సీఎం జగన్

తగరపువలస: నిరంతరం పేద ప్రజల సంక్షేమం కోసం తపించే మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపులో ఆయన పలువురికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో సంక్షేమానికి రూ.25 కోట్లు, అభివృద్ధికి రూ.4 కోట్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. అంచెలంచెలుగా రాష్ట్రాన్ని గ్రామ స్థాయి నుంచి అభివృద్ధి పథంలో పటిష్టపరుస్తుంటే చంద్రబాబు, పవన్‌లు ఓర్వలేక పసలేని ఆరోపణలు చేస్తూ నవ్వుల పాలవుతున్నారన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే గడప గడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్, జగనన్న సురక్ష వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుంటే చంద్రబాబు, పవన్‌కు కంటిమీద కునుకు లేకుండా పోతోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల పైడిరాజు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, గ్రామ సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కాద సూర్యనారాయణ, కేపీ సత్యనారాయణ, శిరుగుడి ఈశ్వరరావు, బొడ్డు దుర్గారావు, గాడు తాతినాయుడు, తోట ఎల్లారావు, గుడ్డాల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై టమాటాల విక్రయం



రైతు బజార్‌లో సబ్సిడీపై టమాటాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మధురవాడ: బహిరంగ మార్కెట్‌లో టమాటా కిలో రూ.120 వరకు పలుకుతుండడంతో రైతు బజార్‌లో ప్రభుత్వం సబ్సిడీపై రూ.50కే కిలో సరఫరా చేస్తోంది. ఇందులో భాగంగా మధురవాడ రైతు బజార్‌లో గత కొద్ది రోజులుగా నిరంతరాయంగా ఈవో జగదీశ్ పర్యవేక్షణలో టమాటాలు అందిస్తున్నారు. ఈ నెల 4న 2,013 కిలోలు, 5న 1,554, 7న 1,574, 8న 1,556, 9న 1,529, 10న 1,550, 11న 1,350, 13న 1,022 కిలోలు చొప్పున మొత్తంగా 13,948 కిలోలు ఇప్పటి వరకూ సరఫరా చేసినట్టు జగదీష్ చెప్పారు. ఆధార్ కార్డు కలిగి ఉన్న ప్రతి వినియోగదారునికి కిలో చొప్పున రోజూ ఇస్తున్నామని తెలిపారు.

'జగనన్న సురక్ష' నేడు

పద్మనాభం: మండలంలోని రెండు గ్రామాల్లో శనివారం 'జగనన్న సురక్ష' క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.విజయకుమార్ తెలిపారు. రెడ్డిపల్లి, తునివలస గ్రామాల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తామని, అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందిస్తామని తెలిపారు.

21 నుంచి ఓటర్ల జాబితాల పరిశీలన



సమావేశంలో ఓటర్ల నమోదు అధికారి భాస్కరరెడ్డి, తదితరులు

భీమునిపట్నం: భీమిలి పరిధిలో ఈ నెల 21 నుంచి బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో) ఇంటింటికీ వెళ్లి జాబితాలోని ఓటర్ల వివరాలు పరిశీలిస్తారని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కర రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం పలు రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పొరపాట్లు ఉంటే బీఎల్‌వోలు సరిచేస్తారని చెప్పారు. అలాగే కొత్త ఓటర్లు తమ పేర్లు ఎలా నమోదు చేసుకోవాలో తెలుపుతారని, చనిపోయిన వారివి, స్థానికంగా నివసించని వారివి తొలగిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమవంతు సహకారం అందివ్వాలని కోరారు. అదేవిధంగా అర్హులైన కొత్త వారు ఓటు నమోదు చేసుకునేందుకు సహకరించాలని కోరారు. కంటుభుక్త రామానాయుడు, సుభాష్, రాంబాబు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ భాస్కరరావు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు



కాళ్ల జ్ఞానేశ్వరి



బోని కావ్య



బోర త్రిలోక్



కొట్యాడ కార్తీక్

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన కాళ్ల జ్ఞానేశ్వరి, బోని కావ్య, జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు పరిధిలోని చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బోర త్రిలోక్, కొట్యాడ వేద వ్యాస కార్తీక్‌కు ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించాయి. గత మే నెలలో విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విజయనగరం జిల్లా భోగాపురం మండలం మద్దిపేటకు చెందిన బోర త్రిలోక్ 585 మార్కులతో భీమిలి మండలంలో అగ్రస్థానంలో నిలిచాడు. జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొండపేటకు చెందిన కొట్యాడ వేద వ్యాస కార్తీక్ 579 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచాడు. వీరిద్దరూ చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు. వీరికి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించినట్టు ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు తెలిపారు.

- భీమిలి మండలం శింగనబందకు చెందిన కాళ్ల జ్ఞానేశ్వరి 582 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానం సాధించింది. ఈమెకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు లభించగా లక్ష్మీపురం పంచాయతీకి చెందిన బోని కావ్యకు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీట్లు లభించాయి. ఈమెకు పదో తరగతి పరీక్షలో 571 మార్కులు లభించినట్టు ప్రధానోపాధ్యాయుడు గాడు పైడిరాజు తెలిపారు.

నూకాలమ్మ సారె ఊరేగింపు



అమ్మవారికి సారె తీసుకెళ్తున్న మహిళలు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెంలో శ్రీ నూకాలమ్మ అమ్మవారికి మహిళలు సారె సమర్పించారు. ఏటా జూలైలో అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరతోపాటు పండ్లు, స్వీట్లు సమర్పిస్తుంటారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళవాయిద్యాల నడుమ సారె సమర్పించారు.

ఆకతాయిలపై కఠిన చర్యలు



వాంబే కాలనీలో సీఐ రామకృష్ణ, సిబ్బంది

మధురవాడ / పీఎం పాలెం: మధురవాడ పరిసర ప్రాంతాల్లో ఆకతాయి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పీఎం పాలెం సీఐ రామకృష్ణ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం వాంబేకాలనీ పరిసరాల్లో సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఇక్కడ పలు ప్రాంతాల్లో కొందరు ఆకతాయిలు గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవిస్తూ చుట్టుపక్కల వారిని ఇబ్బందులు పెడుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా సరైన రికార్డులు లేని 12 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

114 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయింపు



పద్మనాభం మండలం తునివలసలో కేటాయించిన ఇళ్ల స్థలాల వద్ద భీమిలి లబ్ధిదారులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డుకు చెందిన 114 మంది లబ్ధిదారులకు రెండో విడతలో భాగంగా శుక్రవారం పద్మనాభం మండలం తునివలసలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఈ సందర్భంగా వారికి కేటాయించిన స్థలాల వద్ద జియో ట్యాగింగ్ చేశారు. అనంతరం అక్కడ లబ్ధిదారులు మాట్లాడుతూ ఎంతో అనుభవం ఉందని చెప్పుకుంటున్న చంద్రబాబు గతంలో ఎన్నోమార్లు జన్మభూమి కమిటీల చుట్టూ తిప్పించుకున్నా ఇంటి స్థలాలు ఇవ్వలేదన్నారు. జనసేన వెంట వెళ్తే ఆ పార్టీ నాయకులకే కాకుండా వెంట వెళ్లిన ప్రజలకు కూడా భవిష్యత్తు ఉండదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, సీనియర్ నాయకుడు బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ నాగిరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, గఫూర్, రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, కొయ్య రామకృష్ణ, కొంకి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వలందపేటలో డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం



వలందపేటలో డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు వలందపేటలో 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీల నిర్మాణానికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇప్పటి వరకు వార్డులో రూ.8 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశారన్నారు. డ్రైనేజీల నిర్మాణానికి రూ.7 లక్షలు మంజూరు చేశారన్నారు. వార్డులో టీడీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిల్ల సూర్యనారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శిల్లా వంశీరెడ్డి, కంచుబోయిన వెంకటరావు, కొసన శ్రీనివాసరెడ్డి, నగిరెడ్ల రాంబాబు, బవిరిశెట్టి సింహాద్రి, కళింగపట్నం రాంబాబు, కంబపు దుర్గారెడ్డి, కోనాడ కనకరాజు, చిల్ల ప్రమీల, జీరు పద్మ తదితరులు పాల్గొన్నారు

బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు హారతి ఇస్తున్న మహిళలు

కొమ్మాది: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి సుభాష్‌నగర్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయి, వలంటీర్ అందిస్తున్న సేవలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్లలోనే 60 ఏళ్ల పాలనను చేసి చూపించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తుంటే పచ్చ మీడియా, ప్రతిపక్ష నాయకులు మాత్రం ప్రభుత్వ పాలనపై విషం కక్కుతున్నారన్నారు. ఎమ్మెల్యేగా కూడా గెలవని పవన్ కల్యాణ్ రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు సంతోషంగా ఉన్నారని గ్రహించిన చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే మరలా ఇవే సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెబుతున్నారన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి స్థానిక సమస్యలు

స్థానిక సుభాష్‌నగర్‌లో వైన్‌షాప్ వల్ల ఇబ్బందులు పడుతున్నామని, దాన్ని నివాసాలకు దూరంగా తరలించాలని, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని, ఇక్కడి కొండపైకి మంచినీటి సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యేని కోరారు. ఈ ప్రాంతంలో బెల్ట్ షాపులు ఎక్కువగా నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లగా... వెంటనే ఆయన ఎక్సైజ్ సీఐ సరోజకు ఫోన్ చేసి బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్, ఉప్పులూరి గోపి, అల్లాడ ఉమామహేశ్వరరావు, నొడగల రాంబాబు, మాదు చంటి, బుజ్జి, బాగం సుధాకర్, చిల్లా శ్రీనివాసరెడ్డి, సీరపు వంశీకృష్ణరెడ్డి, రమణమూర్తి, దువ్వి వాసు తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలస చెరువు సుందరీకరణ పనులు షురూ



రంగూరి లే అవుట్ వైపు సిద్ధం చేస్తున్న వాకింగ్ ట్రాక్



బొగ్గురోడ్డు వైపు అధికారులు పటిష్టం చేసిన చిట్టివలస చెరువు గట్టు

తగరపువలస: ఎట్టకేలకు చిట్టివలస – చిల్లపేట పెద్ద చెరువు సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. 36.40 ఎకరాల విస్తీర్ణం కలిగిన చెరువులో 25 ఎకరాల్లో రూ.6.50 కోట్లతో చేపట్టనున్న గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ పనులకు ఈ నెల 1న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు భూమి పూజ చేసిన సంగతి తెలిసిందే. చెరువులోకి వస్తున్న మురుగును ఇప్పటికే రెండు జేసీబీలతో దారి మళ్లించడమే కాకుండా పూడిక, తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. గత టీడీపీ ప్రభుత్వం చెరువు తూర్పు, ఉత్తర దిక్కులలో నాసిరకం పనులతో చేసిన గట్లు బలహీనంగా మారడంతో తిరిగి వాటిని పటిష్టపరిచే పనులు చేస్తున్నారు. తగరపువలస, చిట్టివలస డివిజన్ల మధ్య విస్తరించిన భీమిలి రోడ్డును ఆనుకుని ఉన్న ఈ చెరువు బ్యూటిఫికేషన్ పనులు పూర్తయితే నియోజకవర్గంలోనే ఒక అందమైన ప్రదేశం రూపుదిద్దుకుంటుంది. చెరువుకు నాలుగు వైపులా వాకింగ్ ట్రాక్, గట్టుపై కూర్చునేందుకు బెంచీలు, పార్కులు, విద్యుత్ దీపాలు, బోటు షికారు తదితర వసతులు సమకూరనున్నాయి.

ఊరించి చేతులెత్తేసిన టీడీపీ

2014 – 2019 టీడీపీ హయాంలో ఎన్నికలకు ముందు చిట్టివలస చెరువు బ్యూటిఫికేషన్ పనులు చేస్తామని అప్పటి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇక్కడి ప్రజలను ఊరిస్తూ వచ్చారు. సరిగ్గా 2019 ఎన్నికల ముందు 2018 డిసెంబరులో రూ.1.98 కోట్లతో కేవలం రెండు వైపులా చెరువు గట్ల పటిష్టానికే శిలాఫలకం వేసి బ్యూటిఫికేషన్ పనులను విస్మరించారు. వెంటనే ఎన్నికలు రావడం... అప్పట్లో చేసిన నాసిరకం పనుల కారణంగా గట్లు చీలిపోయి వాటిపై తుమ్మ చెట్లు పెరిగిపోయాయి. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ చేపడుతున్న నాలుగు వైపులా గట్ల నిర్మాణంతోపాటు బ్యూటిఫికేషన్ పనులు ఏడాదిలోగా పూర్తిచేసి ఇక్కడి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ప్రస్తుతం చెరువును చుట్టూ శుభ్రపరచడంతో మంచి లుక్ వచ్చిందని ఇక్కడి వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది పూర్తయితే చెరువును ఆనుకుని ఉన్న పెరికివీధికి దుర్వాసన సమస్య తీరుతుందని అంటున్నారు. టీడీపీ ఊరించి చేతులు ఎత్తేసిన ప్రాజెక్టును వైఎస్సార్‌సీపీ పూర్తి చేస్తుండటంతో సీఎం జగన్ చెబితే చేస్తారని స్థానికులు అంటున్నారు.

గెడ్డపై నీటి ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పరదేశిపాలెంలో శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా గెడ్డ పెద్ద ఎత్తున పొంగి ప్రవహించింది. వాస్తవానికి ఇక్కడ భారీ స్థాయిలో వర్షాలు కురిసినప్పుడు గెడ్డపై పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తుంది. అయితే వర్షం కురవనప్పటికీ శుక్రవారం ఆకస్మాత్తుగా వరద ప్రవహించడంతో స్థానికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. అధికారులు స్పందించి ఓ వంతెన ఏర్పాటు చేస్తే తమ సమస్య తీరుతుందని స్థానికులు కోరుకుంటున్నారు.



పరదేశిపాలెంలో గెడ్డపై ప్రవహిస్తున్న నీరు

పోలీసులు దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు

దొండపర్తి : పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీస్ సిబ్బంది చేసిన కవాతును సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కవాతుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని, 8వ బెటాలియన్‌లో ఉన్నపుడు పరేడ్‌కు మరింత ప్రాధాన్యత ఇచ్చేవాడినన్నారు. 2006లో రాష్ట్ర స్వాతంత్ర్య వేడుకల్లో పరేడ్ కమాండర్‌గా చేయడంతో తనకు కవాతుపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఏఆర్ సిబ్బంది చేసిన కవాతును, టర్న్ ఔట్‌ను అభినందించారు. ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చక్కగా విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివాస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిబ్బందికి శాఖాపరమైన అంశాలలో ఏదైనా సమస్య ఉంటే నెలలో కచ్చితంగా ఒక శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామని వివరించారు. సిబ్బందికి ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రీవెన్స్ ఏర్పాటు చేసి 11 మంది నగర ఏఆర్ సిబ్బంది నుంచి వినతులు తీసుకొని వాటి పరిష్కరించే దిశగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.